

ఎవరికో మద్దతు..?

సికింద్రాబాద్ కంటోన్మెంట్.. ఉత్తరాదిన కశ్మీ ర్ మొదలుకొని దక్షిణాన కన్యాకుమారి, దక్షిణాన గుజరాత్ నుంచి తూర్పున పశ్చిమ బెంగాల్ వరకు అన్ని రాష్ట్రాల ప్రజలు జీవించే విలక్షణమైన ప్రాంతం. నగరంలో అంతర్భాగంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ప్రభావం అంతంత మాత్రంగానే ఉంటుంది. చుట్టూ మిలటరీ స్థావరాలు, శిక్షణ కేంద్రాలు, సైనికుల నివాస క్వార్టర్లు కలిగిన ఈ ప్రాంతం మినీ భారత్ అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇంతటి ప్రత్యేకతలు కలిగిన కంటోన్మెంట్‌లో ఎన్నికల్లో విశేషంగా ప్రభావం చూపే వర్గాలు కొన్ని మాత్రమే ఉన్నాయి. ఆయా వర్గాల ప్రభావం, ఎన్నికల పాత్రపై ప్రత్యేక కథనం. –కంటోన్మెంట్

తమిళుల ప్రాబల్యం ఎక్కువే..

నిజాం పాలన నాటి నుంచే తమిళనాడుకు చెందిన వేలాది కుటుంబాలు ఇక్కడకు వచ్చి స్థిరపడ్డాయి. నిర్మాణ కూలీలుగా వచ్చిన వీరిలో అధికశాతం మంది ఇప్పటికీ నిరుపేదలుగానే ఉన్నారు. కంటోన్మెంట్ పరిధిలో సుమారు 30 వేల ఓటర్లు ఉంటారని అంచనా. తమిళుల్లో ఆరవ మాల సామాజిక వర్గానికి చెందిన వారే 90 శాతానికి పైగా ఉంటారు. ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన రాజకీయ పక్షాలు వీరి ఓట్లను ఆకర్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటాయి. అయితే ఈ సారి తమిళ మూలాలు కలిగిన శ్రీగణేశ్ బీజేపీ నుంచి పోటీలో ఉండటం ఆసక్తికరంగా మారింది.

గుజరాత్, రాజస్థానీయులు..

సికింద్రాబాద్ పరిధిలోని వ్యాపారుల్లో పెద్ద సంఖ్యలో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోనే నివాసముంటారు. ముఖ్యంగా గుజరాత్, రాజస్థాన్‌కు చెందిన మార్వాడీలతో పాటు దిగంబర్, శ్వేతాంబర్ జైనుల ఓట్లు 5వేల నుంచి 8 వేల వరకు ఉంటాయి. కంటోన్మెంట్‌లోని 400కు పైగా కాలనీల్లో విస్తరించిన వీరు సాధారణంగా స్థానిక బోర్డు, అసెంబ్లీ ఎన్నికల పట్ల అనాసక్తి చూపుతుంటారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఆయా కాలనీల ఓటింగ్ శాతం ఎక్కువగా ఉంటోంది.

తెలంగాణ సెటిలర్లు..

రసూల్‌పురా, అన్నానగర్ పరిధిలోని సుమారు 30 బస్తీల్లో తెలంగాణలో వివిధ ప్రాంతాల నుంచి వలసొచ్చిన కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉంటాయి. సామాజిక వర్గాల పరంగా ఎస్సీ, బీసీలు అధికంగా ఉండే ఈ బస్తీల్లో ప్రతీసారి ఓటింగ్ 70 శాతం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పక్షాలు అన్నీ వీరి ఓట్లపైనే దృష్టి సారిస్తుంటాయి. మొత్తం ప్రచారంలో సగానికిపైగా ఇక్కడే సాగుతూ ఉంటుంది.

ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలు..

కంటోన్మెంట్ 1, 2, 3 వార్డుల పరిధిలో ముస్లిం ఓటర్ల సంఖ్య గణనీయంగా ఉంటుంది. రాజకీయ వర్గాల ప్రాథమిక అంచనా మేరకు సుమారు 40 వేల వరకు ఉండే ముస్లిం మైనారిటీ ఓట్లపై కాంగ్రెస్, బీజేపీలు ప్రధానంగా దృష్టి సారిస్తున్నాయి. బ్రిటిష్ కాలం నుంచి ఇక్కడే స్థిరనివాసమున్న వివిధ ప్రాంతాలకు చెందిన క్రిస్టియన్ కుటుంబాలు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. మారేడుపల్లి, తిరుమలగిరి, బొల్లారం, బోయిన్‌పల్లి ప్రాంతాల్లో వీరి ప్రాబల్యం ఎక్కువగా ఉంటోంది.

వైశ్యులు.. వైశ్యులు ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కంటోన్మెంట్ ఒకటి. మూడు వాసవీ కాలనీలతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఈ వర్గానికి చెందిన ఓటర్లు సుమారు 5 వేల నుంచి 8 వరకు ఉంటారని అంచనా. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలు ఈ వర్గం ఓట్లను ఆకర్షించేందుకు ప్రత్యేక సమ్మేళనాలు సైతం నిర్వహిస్తూ ఉంటాయి.

ముదిరాజ్‌లు.. బీసీల్లో అత్యధిక ఓటర్లు కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గం ఓట్లు కంటోన్మెంట్ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. కొర్వి కృష్ణసామి ముదిరాజ్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో ముదిరాజ్‌ల సమ్మేళనాలు విరివిగానే జరిగాయి. ఈ సమావేశాల్లో అన్ని రాజకీయ పక్షాల నేతలూ పాల్గొన్నారు. దీంతో ప్రస్తుత ఎన్నికల్లోనూ ఈ వర్గానికి చెందిన నేతలు అన్ని పార్టీల్లోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఎస్సీలు.. నగరంలోని ఏకైక ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం ఇదే. లక్షకుపైగా ఎస్సీ వర్గాలకు చెందిన ఓటర్లు ఉంటారని అంచనా. ఎస్సీల్లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓట్లే అధిక సంఖ్యలో ఉంటాయి. అయితే ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వారిలో అధిక శాతం మంది మాల సామాజిక వర్గం వారే ఉన్నారు. ఈ సారి సైతం ప్రధాన పార్టీలకు చెందిన ముగ్గురు అభ్యర్థులు మాల సామాజిక వర్గమే కావడం గమనార్హం.

విదేశీ చదువులకు ప్రోత్సాహం

ఉస్మానియా యూనివర్సిటీ: విదేశాలలో చదువుకునే విద్యార్థులను ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహిస్తుందని రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి అన్నారు. గురువారం ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన స్టడీ అబ్రాడ్ ఫెయిర్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి 36 వర్సిటీలకు చెందిన 800 మంది విద్యార్థులు హాజరుకాగా రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ పాల్గొన్నారు.



లాలాపేట వాసులతో మాట్లాడుతున్న పద్మారావు గౌడ్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్

లాలాపేట: అన్ని వేళలా సికింద్రాబాద్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాటుపడుతున్నామని ఇదే తమను ప్రతిసారి ఎన్నికల్లో గెలిపిస్తుందని, ఈ ఎన్నికల్లో గతంలో కన్నా అధిక మెజారిటీతో గెలుపొందుతామని సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం తార్నాక డివిజన్‌లో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డితో కలిసి పద్మారావు గౌడ్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. లాలాపేట, రామ్‌థియేటర్, లేబర్ అడ్డా, భజన సమాజం, వివేకానంద విగ్రహం, విద్యామందిర్ స్కూల్, ఆర్యనగర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. స్థానికులు పద్మారావు గౌడ్‌కు స్థానికులు అడుగడుగునా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. లాలాపేటలో కోట్ల రూపాయలతో తాము చేపట్టిన అభివృద్ధి పనులు కళ్లెదుటే కనిపిస్తున్నాయన్నారు. రోడ్డు విస్తరణ, జాతీయ స్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్,అధునాతన హంగులతో ఫంక్షన్ హాల్ తదితర నిర్మాణాలు తుది దశలో ఉన్నాయన్నారు. దీంతో పాటు మంచినీటి సరఫరా, సివరేజ్ సమస్యలు, విద్యుత్ సరఫరా తదితర సమస్యలను పరిష్కరించామన్నారు. ప్రచారంలో సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్,కూరెల్లి నాగరాజు గౌడ్, వంజరి ముత్యాలు, నాగేశ్వర్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, స్టాలీన్ కృష్ణవేణి, పద్మ, గీతా దయాకర్, అనసూయమ్మ, వనజ పాల్గొన్నారు.

పజ్జన్నా అంటే పలుకుతా..



లాలాపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం లాలాపేటలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. గత 36 ఏళ్ల క్రితం కార్పొరేటర్‌గా రాజకీయ జీవితం ప్రారంభమైందని నాటి నుంచి నేటి వరకు పిలిస్తే పలికే నాయకునిగా సికింద్రాబాద్ నియోజక వర్గం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నానన్నారు. అర్ధరాత్రి సైతం సహాయం కోసం తన ఇంటి వద్దకు ప్రజలు వస్తారని వెంటనే వారికి సహాయం చేస్తానన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ తాను కారులో వెళుతుంటే సైతం పజ్జన్నా అని పిలుస్తారు..తాను కారు ఆపి వారికి షేక్ హ్యాండ్ ఇచ్చి వెళ్తానన్నారు. పిల్లలు, యువకులు, పెద్దలు నన్ను పజ్జన్నగా పిలువడం ఎంతో అదృష్టమని ఈ పిలుపుతో తనను ఏ బస్తీలో అయినా గుర్తు పట్టని వారు అంటూ ఉండరని తెలిపారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలి



అన్నానగర్‌లో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

రసూల్‌పురా: అసమర్థత, అబద్ధాల అహంకారంతో పాటు మతవిద్వేష పాసిస్టు పాలన సాగిస్తున్న మోదీ సర్కారు, అవినీతి నియంతృత్వ కేసీఆర్‌ను ఓడించాలని తెలంగాణ రాష్ట్రర ప్రజాస్వామ్య వేదిక జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. గురువారం కంటోన్మెంట్ నియోజకవర్గం అన్నానగర్ బోయిన్‌పల్లి బాపూజీనగర్, మార్కెట్‌యార్డు కార్ఖాన, పికెట్ మారేడుపల్లి, లాల్‌బజార్ బొల్లారం, ఆదర్శనగర్, లోతుకుంట రిసాల బజార్ బస్తీల్లో జాగో తెలంగాణ బస్సు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ.. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను వేల కోట్ల కుంభకోణాలతో కేసీఆర్ కుటుంబం కాలరాసిందని ఆరోపించారు. కాళేశ్వరం, మిషన్ భగిరథలో భారీ అవినీతి జరిగిందన్నారు. ఇక కేంద్రంలో మోదీ ప్రభుత్వం విదేశాలలో ఉన్న నల్లధనం తెచ్చి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మొండిచేయి చూపిందన్నారు. మోదీ విధానాలతో తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ అసమర్థ, అవినీతి పాలనకు సమర్థించారని వీరికి ఎంఐఎం తోడుగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ.లక్ష్మి నారాయణ, ప్రొ. పద్మజా షా, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, పులికల్పన, సంధ్య సౌజన్య, గౌస్ బాలు, రాము, శివ వినయ్ పాల్గొన్నారు.

లాస్యకు మాల సంఘం ప్రతినిధుల మద్దతు



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితకు మాల మహానాడు నేతలు కార్ఖానాలోని లాస్య నివాసంలో కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లాస్య నందిత మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోండటం సంతోషంగా ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక ఆయా వర్గాలకు ఇచ్చే హామీలన్నీ నెరవేరుస్తానని అన్నారు. తన తండ్రి, దివంగత నేత సాయన్న చేపట్టిన అభివృద్ధి పనులను యథావిధిగా కొనసాగేలా చూస్తానన్నారు. గీతమ్మ, మాల సంఘం ప్రతినిధులు సుమన్, చన్నేశ్వర్, పరశురాం, అప్పు, దాసరి విశాల్, ఈసడి శ్రీనివాస్, శ్రీరాములు, సందీప్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన పిట్ల నాగేశ్



మాట్లాడుతున్న పిట్ల నాగేశ్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నేత, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పిట్ల నాగేశ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న ముఖ్య అనుచరుడిగా కొనసాగిన ఆయన గతంలో సికింద్రాబాద్ గణపతి దేవాలయం చైర్మన్‌గా పనిచేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన అనంతరం పికెట్‌లోని బీజేపీ కార్యాలయంలో అభ్యర్థి శ్రీగణేశ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించడంతో పాటు ముదిరాజ్‌లకు ఏడు స్థానాల్లో టికెట్ కేటాయించిన బీజేపీకే ముదిరాజ్‌లు జై కొడుతున్నారన్నారు. బీజేపీలో చేరిన వారిలో సతీష్, జగన్ మోహన్, రాజేందర్, రఘు, శ్రీను ఉన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 25న (శనివారం) జరగనున్న ప్రజా ఆశీర్వద సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంబంధిత అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. భారీ సంఖ్యలో జనాలు రానున్న నేపథ్యంలో తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. –సాక్షి, సిటీబ్యూరో



ప్రజలు సుభిక్షంగా ఉండేలా బీజేపీ మేనిఫెస్టో

బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి



సనత్‌నగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: బీజేపీ గెలుపుతోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం జరుగుతుందని సనత్‌నగర్ బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని సుభాష్‌నగర్, జయప్రకాష్‌నగర్, లింగయ్య నగర్, చాణక్య నగర్‌లలో ఇంటింటి పాదయాత్ర నిర్వహించి కమలం గుర్తుపై ఓటు వేసి తనను గెలించాల్సిందిగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయనకు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలను తెలుసుకొని పరిష్కరించటం జరిగిందన్నారు. ప్రస్తుత పాలనలో అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడిందన్నారు. సాంకేతిక లోపాలు తలెత్తడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తాను ఏ సమస్య పరిష్కరించినా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేయటం జరిగిందన్నారు. తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండే విధంగా బీజేపీ మేనిఫెస్టో రూపొందించిందన్నారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత ఆశ పడ్డారని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న లీకేజీలతో తో వారి ఆశలు అడియాసలుగా మిగిలాయన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించేందుకు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే బీజేపీ చొరవ తీసుకుంటుందన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించి అవినీతిపరులను జైలుకు పంపించే నిశ్చయంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉన్నారన్నారు.



బీఆర్ఎస్‌కే ముస్లింల మద్దతు



శ్రీనివాస్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ముస్లిం సోదరులు

రసూల్‌పురా: ముస్లిం మైనార్టీల మద్దతు బీజేపీకి ఉందని ఆ పార్టీకి చెందిన నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని కాని ముస్లిం సోదరులు బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నారని ఆ పార్టీ రెండవ వార్డు ఇన్‌చార్జి టీఎన్. శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌కు చెందిన రెండు వందల మంది ముస్లింలు టీఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని వర్గాల మద్దతుతో రసూల్‌పురా నుంచి పన్నెండు వేల మెజారిటీ సాధిస్తామని చెప్పారు. ముస్లిం మైనార్టీలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను నమ్మడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వాహాబ్, అజ్జు, అలీ, సయ్యద్ జలాల్, అక్బర్, ఖాజా పాషా, ఫారుఖ్, జలీల్ ఖలీల్, ఖాదర్, భాస్కర్, భిక్షపతి, శ్రీను, పొన్నాల బాబు, దేవరాజ్, యాదన్న, మల్లేష్, నాగేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆదం సంతోష్‌కు మద్దతు



సంతోష్‌కు మద్దతు తెలుపుతున్న సంఘం సభ్యులు

బౌద్ధనగర్: సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మున్నూరు కాపు సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ అభ్యర్థి సంతోష్‌ను కలిసి అభినందనలు తెలిపారు. నాయకులు హన్మంత్ రావు, నరేష్, జగదీష్ పాలొన్నారు.

మాణికేశ్వర్‌నగర్‌లో ప్రచారం..

లాలాపేట: సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్‌కు మద్దతుగా గురువారం మాణికేశ్వర్‌నగర్ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో ఇందిరమ్మ ప్రభుత్వంలోనే వడ్డెర బస్తీలో ఇండ్లు ఇచ్చారని, బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో ఏ ఒక్కరికి ఇళ్లు రాలేదన్నారు. బోదాసు నర్సింహా, వేముల శ్రీనివాస్, వరికుప్పల రవి, లాజరస్, కుమార్, వెంకటేష్, ముత్తయ్య పాల్గొన్నారు.

మళ్లీ అధికారంలోకి వస్తాం.. అభివృద్ధి కొనసాగిస్తాం

బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్



ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరుగులేని మెజార్టీతో అధికారాన్ని చేజిక్కించుకుని మళ్లీ సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులను కొనసాగిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం ఆయన రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని కాచిబోలి, గైడీన్‌బాగ్, నల్లగుట్ట, టొబాకో బజార్, కటికబస్తీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ఒక వైపు వర్షం కురుస్తున్న ప్రజలు ఆయనకు మంగళహారతులతో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం దేశంలో లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. తలసాని సాయి కిరణ్‌యాదవ్, అత్తెల్లి అరుణగౌడ్, మల్లికార్జున్‌గౌడ్, కిరణ్మయి, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, కోటేశ్వర్‌గౌడ్, దుబాయ్ శ్రీను, సతీష్ పాల్గొన్నారు.



కేసీఆర్ హయాంలోనే ముస్లింలకు మేలు..

బన్సీలాల్‌పేట: కాంగ్రెస్, బీజేపి పార్టీలకు ప్రజల ఓట్లు కావాలి తప్ప వారి సమస్యలను పట్టించుకోరని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. బుధవారం రాత్రి బోయిగూడలోని మసీద్ వద్ద ముస్లింలు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఆ రెండు పార్టీలకు ప్రజలు గుర్తుకొస్తారని ధ్వజమెత్తారు. 55 ఏళ్ల పాటు కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజలకు ఏం చేసిందో చెప్పగలరా అని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గత తొమ్మిదిన్నర ఏళ్లుగా తెలంగాణకు చేసిందేమీ లేదని కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వంలో ముస్లింల అభివృద్ధికి పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అన్ని వర్గాలను సమన్వయంతో చూసే ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ మాత్రమే అని కాబట్టి మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్పొరేటర్ కుర్మ హేమలత, జిలానీ, ఉమర్,ఇషాక్, ఇజాజ్, తాహేర్ పాల్గొన్నారు.



తనకు ఓటేయాలని కోరుతున్న తలసాని

బీసీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న కోట నీలిమ

కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ

అమీర్‌పేట: బీసీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి కోట నీలిమ అన్నారు.కాంగ్రెస్ నాయకుడు అయిల మధుగౌడ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బీసీ ఆత్మీయ సమ్మేళనంలో నీలిమ పాల్గొని మాట్లాడారు. బీసీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రత్యేక కేటాయింపులు చేశామని తెలిపారు. రాష్ట్రంతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు.

ధర్మం, అధర్మం నడుమ పోరాటం

బన్సీలాల్‌పేట: ఈ ఎన్నికలు ధర్మం, అధర్మం మధ్య నడుస్తున్న పోరాటమని ప్రజలు అధర్మంతో నడుస్తున్న బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పి ధర్మం వైపున్న కాంగ్రెస్‌ను గెలిపించాలని సనత్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ అన్నారు. గురువారం ఆమె బన్సీలాల్‌పేట్‌లో ఇంటింటికి తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ రాజకీయ పార్టీని నడపడం లేదని ఆయన రాజకీయం పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కేసీఆర్ అహంకార పాలన, నియోజకవర్గంలో రౌడీల రాజ్యం పోవాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

‘బీజేపీ అధికారంతోనే బీసీలకు రాజ్యాధికారం’



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బౌద్ధనగర్: బీసీలకు రాజ్యాధికారం రావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణిని గెలిపించాలని కోరుతూ బౌద్ధనగర్ డివిజన్‌లోని ఎల్ఎస్.నగర్, వారాసిగూడలో నిర్వహించిన రోడ్‌షోలో కిషన్‌రెడ్డి పాల్గొని మట్లాడారు. బీసీలకు ప్రాతినిధ్యం ఇచ్చిన మొదటి పార్టీ బీజేపీ అని, ప్రధాని మోదీ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని పేర్కొన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన నడుస్తోందని, బీజేపీ అధికారంలోకి రాగానే బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి సీఎం అవుతారన్నారు. కేసీఆర్ లాగా ఫాంహౌజ్‌లో పడుకునే సీఎం రాడని బీజేపీ ప్రభుత్వం వస్తే ప్రజలు న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. రోడ్‌షోలో రవి ప్రసాద్ గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, మేకల కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ అధికారులతో ఇఫ్లూ వీసీ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ నేతృత్వంలో అధికారుల బృందం ఇఫ్లూ వీసీ ప్రొ.ఇ.సురేష్ కుమార్‌తో గురువారం సమావేశమయ్యారు. విద్యార్థులకు వివిధ విదేశీ భాషలలో శిక్షణ ఇచ్చేందుకు మొదటి విడత చర్చలు జరిపారు. ఈ విషయమై త్వరలో ఏపీ ప్రభుత్వం, ఇఫ్లూ నడుమ ఒప్పందాలు ఎంఓయూ కుదుర్చుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

బీఆర్ఎస్‌ను ఓడించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని సీపీఐ జాతీయ నాయకులు నారాయణ పిలుపునిచ్చారు. గురువారం ఓయూలో విద్యార్థి సంఘాలు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు ప్రభుత్వ వైఫల్యాలు రాబోవు ఎన్నికల్లో విద్యార్థుల కర్తవ్యం అనే అంశం పై చర్చ గోష్టి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులను గెలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు పుట్ట లక్ష్మణ్, నాయకులు లెనిన్, నెల్లి సత్య, ఎస్ఎఫ్ఐ నేత రవినాయక్, పీడీఎస్‌యూ నేత సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఎరుకల సంఘం మద్దతు

సనత్‌నగర్: ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలంగాణా స్టేట్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెంబసారం కృష్ణ, ప్రధాన కార్యదర్శి కూరాకుల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఎరుకల కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్‌తో పాటు రూ.500 కోట్ల నిధిని ఏర్పాటు చేస్తామని ప్రకటించిందని అందుకే తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తుల మృతి

అడ్డగుట్ట: అనారోగ్య కారణాలతో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. ప్లాట్ ఫాం నెం. 4,5 ఎండ్‌లోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం సుమారు 45–50 ఏళ్ల మధ్య వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన పోలీసులు వెళ్లి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు.

మరో ఘటనలో..

ఈ నెల 22న రాత్రి 11.30 గంటల సమయంలో సికింద్రాబాద్ ప్లాట్ ఫాం నంబర్ 6,7లోని ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ముందు సుమారు 35–40 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

కార్ఖానా పీఎస్ పరిధిలో

రసూల్‌పురా: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కార్ఖానా పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ లఖన్‌రాజ్ వివరాల ప్రకారం.. జింఖానా సబ్‌స్టేషన్ సమీపంలో పికెట్ కేవీ పాఠశాల ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లుసమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు పరిశీలించగా వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు.